## అల్పాహారం పంపిణీ

కోరుట్ల, మే 21: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన ఆవరణలో మంగళవారం లయన్స్ క్లబ్ సభ్యులు వడ్డెపల్లి శ్రీనివాస్-గాయత్రి దంపతుల పెళ్లి రోజు, వేముల షణ్ముఖ సాయి జన్మదినాన్ని పురస్కరించుకుని రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్, క్లబ్ ప్రతినిధులు వనపర్తి రమ్య, కుందారపు ప్రేమలత, మహేందర్, అనంత కృష్ణప్రసాద్, ఆడెపు మధు, కమల, అల్లాడి ప్రవీణ్‌కుమార్, ఉషాకిరణ్, ఇల్లెందుల వెంకటరాములు, తదితరులు పాల్గొన్నారు.

## జనుము, జీలుగ విత్తనాల పంపిణీ

కోరుట్ల రూరల్, మే 21: మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు రాయితీపై జనుము, జీలుగ విత్తనాలను వ్యవసాయాధికారి నాగరాణి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, పచ్చిరొట్ట ఎరువులను సాగు చేస్తే భూసారం పెరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు తీసుకెళ్లాలని సూచించారు.

## నూతన కార్యవర్గం


గంగరాజం

మల్లాపూర్, మే 21: మల్లాపూర్ ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగ గంగరాజం, ఉపాధ్యక్షుడిగా ఇల్లెందుల తుకారాం, కోశాధికారిగా సంబు తిరుపతి, పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.


పెగడపల్లి: మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


మల్యాల: తహసీల్దార్ మునీందర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

# రైతు వ్యతిరేకి కాంగ్రెస్

- దొడ్డు వడ్లకూ రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలి
- బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల డిమాండ్
- జిల్లాలో పలు చోట్ల నిరసన

పెగడపల్లి, మే 21: ఎన్నికల సమయంలో వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు సన్న రకాలకు మాత్రమే ఇస్తామని ప్రకటించడంపై బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు భగ్గుమంటున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, సన్నరకంతో పాటు దొడ్డు వడ్లకు కూడా రూ. 500 చొప్పున బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లోక మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కరుణాకర్‌రావు, రాజేశ్వర్‌రావు, సత్తయ్య, తిరుపతినాయక్, నర్సింహారెడ్డి, ఆంజనేయులు, రాజశేఖర్‌గౌడ్, లక్ష్మణ్, శ్రీనివాస్, గంగాధర్‌గౌడ్, రవీందర్, తిరుపతి, లక్ష్మీనారాయణ, దేవయ్య, లక్ష్మణ్, చందు, తదితరులు పాల్గొన్నారు.

**మల్యాలలో..**

మల్యాల, మే 21: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. దొడ్డు వడ్లకు సైతం క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ చెల్లించాలని తహసీల్దార్ మునీందర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రామ్మోహన్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, నాయకులు తిరుపతిరెడ్డి, రవివర్మ, జోగినిపల్లి శ్రీనివాస్‌గౌడ్, పోచంపల్లి రాజమల్లయ్య, దశరథం, అరున్, సాగర్, రూపేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**కొడిమ్యాలలో..**

కొడిమ్యాల, మే 21: మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దొడ్డు వడ్లకు కూడా రూ. 500 చొప్పున బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ రైతులను విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశంగౌడ్, యూత్ మండలాధ్యక్షుడు గడ్డం లక్ష్మారెడ్డి, నాయకులు అంకం రాజేశం, కొత్తూరి స్వామి, పర్లపల్లి ఆనందం, కాయిత రాజు, మొగిలి రాకేశ్, రాచకొండ చంద్రమోహన్, సోమ సాగర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా రాకేశ్ రెడ్డిని గెలిపించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాకేశ్ రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కోరారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డికి మద్దతుగా వరంగల్ పట్టణంలో మంగళవారం పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నన్నపునేని నరేందర్, కరీంనగర్ మేయర్ సునీల్ రావు, జగిత్యాల బీఆర్ఎస్ నాయకులు దావ సురేశ్, పాలెపు రాజేంద్రప్రసాద్, ఎల్ కార్తీక్, చెట్పల్లి సుధాకర్, ప్రభాత్‌సింగ్ ఠాకూర్, శరత్ రావు, ఎల్ల రాజన్న, దమ్మ రాజిరెడ్డి, ఏనుగుల రాజు, చిట్ల మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీకి నివాళి


జగిత్యాల: రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల/మెట్‌పల్లి/మల్లాపూర్/మేడిపల్లి/పెగడపల్లి/కోరుట్ల, మే 21: జిల్లా వ్యాప్తంగా మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహించారు. కాగా, కేంద్రంలోని ఇందిరాభవన్‌లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పూల మాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విజయలక్ష్మి, నాగభూషణం, శంకర్, తదితరులు పాల్గొన్నారు. మెట్‌పల్లి పట్టణంలో నాయకులు లింగం, రాజేశ్వర్‌గౌడ్, గంగాధర్, షేక్‌మహ్మద్, లక్ష్మణ్ పాల్గొన్నారు. అలాగే, కోరుట్ల పట్టణంతో పాటు మల్లాపూర్, మేడిపల్లి, భీమారం, పెగడపల్లి మండలాల్లో రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆయా మండలాల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా
- వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్ట్ యజమానులతో సమీక్ష

జగిత్యాల, మే 21: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆమె ధాన్యం కొనుగోళ్లపై జిల్లా అధికారులు, రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్టు యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడువకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారం రోజుల్లో అన్ని కేంద్రాల్లో మొత్తం ధాన్యం తూకం వేయాలని ఆదేశించారు. తూకం వేసిన ధాన్యం సంచులపై టార్పాలిన్లు కప్పాలని, సెంటర్ ఇన్‌చార్జులకు తగు సూచనలు జారీ చేయాలని డీఆర్డీవో, జిల్లా సహకార శాఖ అధికారులను ఆదేశించారు. ధాన్యం తరలించడానికి సరిపడా లారీలను ఏర్పాటు చేయాలన్నారు. రైస్ మిల్లుల్లో ధాన్యం వెంటవెంటనే అన్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి మిల్లులో రోజుకు కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యం దిగుమతి అయ్యేలా చర్యలు చేపట్టాలని మిల్లర్లను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, పౌరసరఫరాల అధికారి, పౌరసరఫరాల సంస్థ మేనేజర్, జిల్లా సహకార అధికారి, జిల్లా వ్యవసాయాధికారి, రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్ట్ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

**టీఎస్ స్థానంలో టీజీ అమలు చేయాలి**

జిల్లాలో టీఎస్ స్థానంలో టీజీ తక్షణమే అమలు చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, వెబ్ సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్ ఫారం ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్‌ను టీఎస్ బదులు టీజీ వాడాలని సూచించారు. ప్రభుత్వ శాఖల ద్వారా భవిష్యత్‌లో నిర్వహించే ఉత్తర, ప్రత్యుత్తరాల్లో టీఎస్‌కు బదులు టీజీ అని ముద్రించాలన్నారు. ఈ మేరకు ఈనెల 25లోగా అన్ని శాఖల అధికారులు నివేదికలు పంపాలని, ఆ నివేదికలు క్రోడీకరించి ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు.

## ధాన్యం లారీ బోల్తా

రాయికల్, మే 21: రాయికల్ మండలం మైతాపూర్ బ్రిడ్జి వద్ద మంగళవారం ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. లారీని కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, వల్లకొండ మహేశ్ గౌడ్, రైతులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ, బ్రిడ్జి పనులు నత్తనడకన జరుగుతున్నాయని, అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందన్నారు. మట్టి రోడ్డు నిర్మించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి మట్టి రోడ్డు నిర్మించి, బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని కోరారు.

# రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి


ఇబ్రహీంపట్నంలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రఘువరన్

ఇబ్రహీంపట్నం, మే 21: ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని జడ్పీ సీఈవో రఘువరన్ ఆదేశించారు. మండలంలోని ఇబ్రహీంపట్నం, వర్షకొండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. కస్తూర్బా, అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మంజూరైన పనులను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, ఏఈ పీఆర్ అరుణ, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సహకార సంఘం సీఈవో సతీశ్, రైతులు పాల్గొన్నారు.

## రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్

మల్లాపూర్, మే 21: కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్నదని జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో కేవలం సన్న రకం వడ్లకే రూ.500 బోనస్ ఇస్తామనడం సరికాదన్నారు. ఇప్పటికే రైతులకు పంట రుణమాఫీ, నాణ్యమైన విద్యుత్, రైతు బంధు, రైత బీమా పథకాలను సక్రమంగా అందించడం లేదని ఆరోపించారు. సమావేశంలో ఎంపీటీసీలు ఆకుతోట రాజేశ్, ఏనుగు రాంరెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## రేచపల్లిలో ఎమ్మెల్సీ పర్యటన

సారంగాపూర్, మే 21: మండలంలోని రేచపల్లి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పర్యటించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భుక్యా సరళ, మాజీ సర్పంచులు జయ-లక్ష్మారెడ్డి, ప్రసాద్ గౌడ్, నాయకులు ఎండీ ఇబ్రహీం, రాజన్న, తిరుపతి, శంకర్, మహేశ్, మల్లేశం, గంగమల్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆలయ వార్షికోత్సవం

మెట్‌పల్లి రూరల్, మే 21: మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామంలో షిరిడీ సాయిబాబా ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సాయిబాబాకు అభిషేకం, మధ్యాహ్నం హారతి ఇచ్చారు. శివపార్వతుల కల్యాణోత్సవం జరిపించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెట్‌పల్లి రూరల్, మే 21: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్, రాజేశ్వర్‌రావుపేట, చెర్లకొండాపూర్, మేడిపల్లి, సత్తక్కపల్లి గ్రామాల్లో బుధవారం విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు ఏఈ సిందాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

## ఘనంగా లక్ష్మీనృసింహస్వామి జయంతి

జగిత్యాల, మే 21: జిల్లా కేంద్రంలోని పురాణిపేటలో లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నృసింహ జయంతి సందర్భంగా స్వామి వారికి ఆలయ ప్రధానార్చకుడు పూర్ణానంద చార్యులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పంటల సాగుపై అవగాహన


ఇబ్రహీంపట్నం: వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రైతులు

సారంగాపూర్/ఇబ్రహీంపట్నం, మే 21: సారంగాపూర్, ఇబ్రహీంపట్నం రైతు వేదికల్లో మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ లావణ్య, ఏవోలు తిరుపతి నాయక్, షాహీద్ అలీ, యోగిత, ఏఈవోలు వెంకటేశ్, నరేశ్, శ్యాం, రవళి, హరీశ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండిళ్లలో చోరీ

రాయికల్, మే 21: పట్టణానికి చెందిన బుడిక విజయలక్ష్మి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా, తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలో భద్రపరిచిన 40 తులాల బంగారం, రూ. లక్ష నగదు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది వచ్చి తనిఖీలు చేపట్టగా, క్లూస్ టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, టౌన్ సీఐ వేణుగోపాల్ పరిశీలించారు. బాధితురాలు విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పెగడపల్లి, మే 21: మండల కేంద్రంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి రూ.1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఎస్ఐ జాడి రామకృష్ణ, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న ఆరె బూదమ్మ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో బంధువుల ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. బీరువాలో దాచిన రూ.1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందంతో విచారణ చేపట్టారు. బూదమ్మ కొడుకు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రాయికల్: బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐలు

## ప్రభుత్వ కళాశాలలోనే విద్యార్థులను చేర్పించాలి


మల్లాపూర్: విద్యార్థితో మాట్లాడుతున్న అధ్యాపకులు

మల్లాపూర్, మే 21: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని అధ్యాపకులు కోరారు. మండలంలోని దామరాజుపల్లి, సంగెం శ్రీరాంపూర్ గ్రామాల్లో మంగళవారం విద్యార్థుల అడ్మిషన్ల కోసం ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేశ్, శ్రీనివాస్, నరేశ్, అరవింద్, రాజశ్రీ పాల్గొన్నారు.

సారంగాపూర్, మే 21: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని అధ్యాపకులు కోరారు. జిల్లా నోడల్ అధికారి నారాయణ ఆదేశాల మేరకు అధ్యాపకులు రేచపల్లి గ్రామంలో మంగళవారం ప్రచారం చేశారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను కళాశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, రాజేందర్, వెంకటేశ్వర్లు, సుజాత, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవం

కోరుట్ల రూరల్, మే 21: చిన్నమెట్‌పల్లిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పూజల్లో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు ఐపీఎల్ స్థాయికి ఎదగాలి

కొత్తపల్లి, మే 21 : జిల్లా క్రీడాకారులు క్రికెట్ శిక్షణ శిబిరాల్లో నేర్చుకున్న మెళకువలతో మున్ముందు ఐపీఎల్ స్థాయికి ఎదగాలని కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు ఆకాంక్షించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సౌజన్యంతో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాల ఎదురుగా కేడీసీఏ ప్రధాన మైదానంలో నిర్వహించిన శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించిన కోచ్‌లకు జ్ఞాపికలు ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడాకారులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలువాలన్నారు. భవిష్యత్తులో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రికెట్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు త్వరలో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

## ఆదాయపు పన్ను ఫైలింగ్‌పై అవగాహన

ముకరంపుర, మే 21: ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులకు ఇన్‌కం ట్యాక్స్ ఫైలింగ్‌పై ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ డాక్టర్ ఎన్ రాజుకుమార్, అడిషనల్ కమిషనర్ కిరణ్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ సర్కిల్ హెచ్ లన్ అవగాహన కల్పించారు. ఫైలింగ్, ఫామ్ 16 అప్డేట్, రిటర్న్స్, ప్రాసెసింగ్ లెటర్, ఇంటిమేషన్, నోటీసులు తదితర అంశాలను వివరించారు.

## విద్యార్థికి అభినందన

పెగడపల్లి, మే 21: పెగడపల్లి మండలం ఐతుపల్లి గ్రామానికి చెందిన అలువాల గణేశ్ టీఎస్ ఈసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 35వ ర్యాంక్ సాధించాడు. గణేశ్‌ను మంగళవారం గ్రామస్తులు అభినందించారు.

## పవర్ లిఫ్టింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

కోరుట్ల, మే 21: హైదరాబాద్‌లోని కోటి హనుమాన్ వ్యాయామశాలలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన కల్లెడ రోహిత్, ఠాకూర్ పృథ్వీసింగ్ ప్రతిభ చూపారు. పతకాలు సాధించిన యువకులను పలువురు క్రీడాకారులు అభినందించారు.

## ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు

రాయికల్, మే 21: వడ్డె లింగాపూర్ గ్రామంలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ పట్నాలు వేశారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట గౌడ సంఘం, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

## అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

మల్యాల, మే 21: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజాము నుంచే కొత్త పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో వైరాగ్యం ఏర్పాట్లు చేశారు. ఆలయ పర్యవేక్షకుడు సునీల్, ఇన్‌స్పెక్టర్లు జెమిని శ్రీనివాస్, సంపత్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

చొప్పదండి, మే 21: కేవలం సన్నవడ్లకు మాత్రమే రూ. 500 బోనస్ ఇస్తామంటూ కాంగ్రెస్ రైతులను ఘరానా మోసం చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. ఎన్నికల ముందు మాట ఇచ్చి తప్పిన కాంగ్రెస్ పార్టీకి పట్టభద్రుల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగులకు నెలకు రూ.నాలుగు వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి మాట మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు బోనస్ విషయంలో రైతులను దారుణంగా మోసం చేసిందని దుయ్యబట్టారు.

## పట్టు పురుగుల సాగుపై దృష్టిసారించాలి


శిక్షణకు హాజరైన రైతులు, ప్రొఫెసర్లు

జగిత్యాల టౌన్, మే 21: రైతులు పట్టు పురుగుల సాగుపై దృష్టిసారించాలని పొలాస వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతి నారాయణ్‌భట్ సూచించారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాలలో షెడ్యూల్డ్ కులాల రైతులకు మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ భారతి నారాయణ్‌భట్ మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో సంప్రదాయ పంటల ద్వారా ఆదాయం అంతంతమాత్రమే వస్తోందన్నారు. అదనపు ఆదాయం కోసం పట్టు పురుగుల పెంపకం చేపట్టాలని రైతులకు సూచించారు. ఆసక్తి గల రైతులు బృందాలుగా వస్తే శిక్షణ ఇచ్చేందుకు వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నిరుద్యోగులు పట్టుపురుగుల పెంపకంపై దృష్టి పెడితే లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రత్నాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులకు అభినందన

తిమ్మాపూర్ రూరల్, మే 21: అలుగునూర్‌లోని సీవోఈ విద్యార్థులు ఐఐటీ ఎంట్రెన్స్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. ఐఐటీ, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ మార్చి 2024 ఎంట్రెన్స్‌లో కే ఆశ్రిత జాతీయ స్థాయిలో 86వ ర్యాంకు, ఐఐటీ బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్‌లో బీ సన్నీ జాతీయ స్థాయిలో 94, ఎం ఆదిత్య 111వ ర్యాంకు సాధించగా, వారిని కళాశాల ప్రిన్సిపాల్ జీ దేవేందర్, అధ్యాపకులు అభినందించారు.

## రైతులను ఆగం చేస్తే ఊరుకోం

హుజూరాబాద్, మే 21: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆగం చేస్తే చూస్తూ ఊరుకోమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవని, పుష్కలంగా పంటలు పండిస్తూ సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎప్పుడూ రైతుల పక్షపాతిగా ఆలోచించే వారని, అందుకే ఆయన పాలనలో వ్యవసాయం పండుగలా సాగిందని పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినా కూడా అధికారులు తడిసిన ధాన్యం కొనడంలో జాప్యం చేస్తుండడంతో రైతులు ఆవేదనలో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రైతులకు ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తామని చెప్పి ప్రస్తుతం సన్న వడ్లకు మాత్రమే దానిని పరిమితం చేయడమేమిటని ప్రశ్నించారు.